
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 18 మార్చి 2024



దొరకునా.. ఇటువంటి సేవ

● ముత్యపు, హనుమంత వాహనంపై ఊరేగిన లక్ష్మీనరసింహస్వామి



హనుమంత వాహనంపై కొలుదీరిన స్వామి వారు

గుర్రంకొండ, మార్చి 17: గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారు ముత్యపు, హనుమంత వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి, ఆలయ శుద్ధి, తోమాలసేవ, అర్చన, ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని అందంగా అలంకరించి ముత్యపు పందిరి వాహనంలో ఉంచి పూజలను చేసి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవను చేసి, రాత్రి హనుమంత వాహనంలో స్వామి వారిని అధిరోహింపజేసి వేద పండితులు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో హనుమంత వాహనంపై నరసింహస్వామిని ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ వెంకటస్వామి, కృష్ణమూర్తి అర్చకులు గోపాల్‌భట్టార్, కృష్ణప్రసాద్, కృష్ణరాజ్, అనిల్, గోకుల్, నరసింహ, వెంకీ, నాగరాజు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రికి సింహవాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు.



ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు

ఎన్నికల ప్రచారం.. @ 700

● రోజు కూలి రూ.700
● మధ్యాహ్నం బిర్యానీ.. మందు అదనం
● కార్యకర్తలు కరువై.. కూలీలతో అధికార పార్టీ నేతల ప్రచారం
● టమోటా పనులకు కూలీల కరువు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకసారిగా ఎన్నికల వాతావరణం వచ్చేసింది. ఎన్నికల ప్రకటన వెలువడడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కూడా అమలులోకి వచ్చేసింది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో ఎన్నికల కార్యక్రమాలలో నిమగ్నమైపోయాయి. ఎన్నికల ప్రక్రియలో తొలి అడుగుగా ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని మొదలు పెట్టారు. సాధారణంగా ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీల కార్యకర్తలు ముందు వరసలో ఉంటారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కార్యకర్తలు పెద్దగా ప్రచార కార్యక్రమంలో పాల్గొనడానికి ఆసక్తి చూపకపోవడంతో అధికార పార్టీ రోజువారీ కూలీలను రంగంలోకి దింపింది. బయట కూలి పనులకు వెళితే వచ్చే దానికంటే ఇంకా కొంచెం ఎక్కువ డబ్బు, బిర్యానీ, మందు కూడా ఇస్తుండడంతో కూలీలు సైతం ప్రచారంలో పాల్గొనడానికి ఆసక్తి చూపుతున్నారు. సేద్యపు పనులకు వెళ్లాల్సిన కూలీలు చేతిలో అధికార పార్టీ జెండాలు పట్టి.. ప్రచారంలో పాల్గొంటుండడంతో పలు ప్రాంతాలలో టమోటా పనులకు కూలీల కరువు ఏర్పడింది.

ముఖం చాటేస్తున్న నాయకులు, కార్యకర్తలు

జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు ఉండగా అందులో సుమారు నెల రోజులకు ముందే అధికార వైసీపీ మదనపల్లె, రాజంపేట నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి కొత్తవారికి అవకాశం ఇచ్చింది. మిగిలిన స్థానాల్లో అభ్యర్థులను శనివారం ఖరారు చేసింది. అయితే తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో సిట్టింగ్‌లనే బరిలోకి దించింది. ముందుగానే అభ్యర్థులను అధికారికంగా ప్రకటించకపోయినా తమకే టికెట్టు ఖరారు అవుతుందనే నమ్మకం ఉండడంతో ఆ నియోజకవర్గాల్లో సైతం ఎప్పటి నుంచో ప్రచారం ప్రారంభించారు.

దీంతో ఒక విధంగా చెప్పాలంటే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ ఎన్నికల ప్రచారం చేస్తోంది. చీరల పంపిణీ, ఇతర కానుకల పంపిణీకి స్థానిక నాయకులు, వలంటీర్లను రంగంలోకి దించారు. స్వయంగా ఎమ్మెల్యే అభ్యర్థులే ప్రచారంలో ఉన్నప్పటికీ వెంట పెద్దగా కార్యకర్తలు పాల్గొనడం లేదనే తెలుస్తోంది. దీనివెనుక బలమైన కారణమే ఉందని అధికార పార్టీ నాయకుల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో అధికార పార్టీ అరాచక పాలన సాగించిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అధికారం శాశ్వతం అనుకుని అధికారాన్ని అడ్డం పెట్టుకుని దాదాపు చెలరేగిపోయారు. ప్రజలపై దాడులు చేశారు. అక్రమ కేసుల్లో ఇరికించారు. పేదల భూములు ఆక్రమించారు. చేయని అక్రమాలు లేవు. ఇదే సమయంలో గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉంది. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ చాలా మంది అర్హులకు లబ్ధి చేకూరలేదు. కొత్తగా పరిశ్రమలు రాలేదు. యువతకు ఉపాధి అవకాశాలు లభించడం లేదు. గత ఐదేళ్లలో కనీసం ఒకసారి కూడా జాబ్‌క్యాలెండర్ విడుదల చేయలేదు. దీంతో ఏటా నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే కాకుండా తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఎన్నికల బరిలో దిగుతున్నాయి. ఈ పరిస్థితిని గుర్తించిన పలువురు అధికార పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మళ్లీ తమ పార్టీ అధికారంలోకి వస్తే.. ఫరవాలేదు. అలాకాకుండా.. కూటమి వస్తే.. ఎలా? అనే భయంతో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు అధికార పార్టీ ప్రచారంలో ముఖం చాటేస్తున్నారని తెలుస్తోంది.

జనం లేకపోతే.. పరువు గోవింద

ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో వీళ్ల వెంట గ్రామ వలంటీర్లు, పార్టీ నియమించిన గృహ సారథులు, సచివాలయ సిబ్బంది వెళ్లేవారు. అయితే ఎన్నికల సంఘం ఆదేశాలతో వలంటీర్లు ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదు. పాల్గొంటే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నాయకుల వెంట వలంటీర్లు బహిరంగంగా తిరగడానికి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి జంకుతున్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులు, ఇతర నాయకుల వెంట జనం పెద్దగా కనిపించడం లేదు. అయితే తమ వెంట జనం లేకపోతే పరువు పోతుందనే భయం ఆయా నాయకుల్లో ఉంది. దీంతో ఎలాగైనా, ఏం చేసైనా తమ వెంట జనం ఉండేలా చూడాలని ముఖ్యనాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రచారంలోకి కూలీలను దించినట్లు పలువురు పేర్కొంటున్నారు. మీ ఓటు ఎవరికైనా వేసుకోండి.. మా వెంట తిరిగి.. మా జెండాలు మోయండి.. చాలు అని ఆ నాయకులు అంటున్నట్లు తెలుస్తోంది.

రోజుకు 700, బిర్యానీ, మందు

ఎన్నికల ప్రచారానికి వచ్చే కూలీలకు రోజుకు రూ.700 కూలీ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు మధ్యాహ్నం బిర్యానీతో పాటు మందు ఇస్తున్నట్లు ప్రచారం ఉంది. ప్రచారని వచ్చిన వాళ్లకు రాత్రికి కూడా మందు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కూలీ పనికి వెళితే రోజంతా ఎండకు కష్టం చేయాలి. అదే ఇక్కడైతే పార్టీల జెండాలు పట్టుకుని తిరిగితే చాలు.. ఇదేదో బాగుందని పలువురు కూలీలు ప్రచారానికి ముందుకు వస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఇలా కూలీలు ప్రచారానికి వెళ్లడంతో.. ప్రధానంగా టమోటా సాగు చేసే పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలలో టమోటాకు కూలీలు దొరకడం లేదని పలువురు టమోటా రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతాలకు చెందిన కూలీలు వేరే నియోజకవర్గాలకు కూడా ప్రచారానికి కూలికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా ఎన్నికలకు సుమారు 53 రోజులు వ్యవధి ఉండడంతో ఇన్ని రోజులు వ్యవసాయ పనులు ఎట్లా? అని రైతులు ఆందోళన చెందుతుంటే.. ఇన్ని రోజుల పాటు కూలీల ఖర్చు భరిస్తూ.. ప్రచారం నిర్వహించేది ఎట్లా? అని నాయకులు ఆందోళన చెందుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.



ఎన్నికల నియమావళి అమలు చేయాలి

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 17: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్‌మీనాకు వివరించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ హాజరై జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లోనూ, 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాల్సి ఉందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఈ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీ-విజిల్లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అందే ఫిర్యాదులపై అదే రోజున చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్-ఎంసీసీ) అమలుపై పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలు, ఇతర క్యాలెండర్లు, జెండాలను, బస్టాండు, రైల్వేస్టేషన్‌లో, రోడ్డుకిరువైపులా, మీటింగ్ ప్రాంతాల్లో అన్ని హోర్డింగులను తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో సత్యనారాయణరావు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల దృష్ట్యా 'స్పందన' రద్దు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 17: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈనెల 18వ తేదీ సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని తెలిపారు.

కోడ్ కూసినా.. తొలగని జగన్ బొమ్మలు

సీటీఎం పంచాయతీ ఆర్‌బీకే బోర్డులో కనిపిస్తున్న సీఎం జగన్ చిత్రం



ఆరోగ్యవరం టిడ్కో ఇళ్ల వద్ద శిలాఫలకంలో కనిపిస్తున్న జగన్, పెద్దిరెడ్డి చిత్రాలు



మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటు బోర్డులో జగన్ ఫొటో





తట్టివారిపల్లె వద్ద ప్రైవేటు దుకాణాలపై ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ లైటింగ్ బోర్డులు

మదనపల్లె టౌన్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 24 గంటలు పూర్తయినా మదనపల్లె మండలం, పట్టణంలో పలుచోట్ల ప్రభుత్వ కార్యాలయాలపై సీఎం జగన్ బొమ్మలను తొలగించలేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా గ్రామ స్థాయి అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఆదివారం సాయంత్రమైనా మండలంలోని సీటీఎం రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యవరం వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజి ఎదురుగా ఉన్న బోర్డులో ప్రాజెక్టు వివరాల పక్కన జగన్ బొమ్మ, ఇటీవలే వైసీపీ నాయకులు ఆర్భాటంగా ప్రారంభించిన టిడ్కో ఇళ్ల వద్ద సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డిల చిత్రాలతో శిలాఫలకం అలాగే కనిపిస్తున్నాయి. సీటీఎం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రారంభించిన శిలాఫలకం వైసీపీ నేతల చిత్రాలతో, ఆర్‌బీకే బోర్డుపై జగన్ చిత్రం అలాగే కనిపిస్తోంది. మెడికల్ కాలేజి వద్ద ప్రాజెక్టు వివరాలతో కూడిన బోర్డులో సీఎం జగన్ ఫొటో అలాగే కనిపిస్తోంది. టిడ్కో ఇళ్ల వద్ద వైసీపీ నాయకులు ప్రారంభించిన శిలాఫలకాన్ని కూడా అధికారులు గుడ్డతో కప్పకుండా అలాగే వదిలేశారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద ఆక్సిజన్ ప్లాంటుకున్న బోర్డులో జగనన్న ప్రాణ వాయువు అక్షరాలతో పాటు సీఎం ఫొటోను అలాగే వదిలేశారు. వీటిపై సంబంధిత ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పక్కా ప్లాన్‌గా లైటింగ్ బోర్డులు

మదనపల్లె నియోజకవర్గంలో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రెండు నెలలుగా ప్రైవేటు దుకాణాలపైన మా నమ్మకం నువ్వే జగన్ అని జగన్ చిత్రంతో కూడిన లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. దుకాణదారులు వారి సొంత ఖర్చులతో ఈ బోర్డులు పెట్టారనుకుంటే పప్పులో కాలేసినట్లే. వైసీపీ అధిష్టానం ఆదేశాలతో ఆ పార్టీ నేతలే ఈ లైటింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి ఎంత లేదన్నా 200 నుంచి 500 లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఒకవేళ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ప్రైవేటు దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డులను ఎంసీసీ అధికారులు తొలగించరని, ఎలాగైనా జగన్ చిత్రం ప్రజలకు కనపడాలనేది ఇక్కడ వైసీపీ నాయకుల ప్లాన్. ఈ బోర్డుల ఏర్పాటుకయ్యే ఖర్చు వైసీపీ అభ్యర్థి ఎన్నికల ఖర్చులో వస్తుందనే విషయం అధికారుల పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

● పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
● 129 కేంద్రాలు... 25,522 మంది విద్యార్థులు

రాయచోటిటౌన్, మార్చి 17: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖాధికారులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్న పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రాల్లో జిల్లాలోని 492 పాఠశాలల నుంచి 22,466 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు 3056 మంది పరీక్ష తప్పిన విద్యార్థులతో కలిసి మొత్తం 25,522 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. అందులో 13,003 మంది బాలురు, 12.519 మంది బాలికలు ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. జిల్లాలోని 129 పరీక్షా కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్స్‌తో పాటు డిపార్టుమెంటల్ అధికారులను, అడిషనల్ డిపార్టుమెంటల్ అధికారులను, రూట్ అధికారులకు పరీక్షల నిర్వహణపైన అవగాహన కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 10 రూట్స్‌ను ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన కస్టోడియన్స్‌తో పాటు జాయింట్ కస్టోడియన్స్‌ను నియమించి పరీక్ష పేపర్లను భద్ర పర్చేందుకు 31 చోట్ల పాయింట్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాలను పర్యవేక్షణలో ఉంచనున్నాయి. విద్యార్థినీ, విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు కానీ, వాచ్‌లు కానీ, క్యాలిక్లేటర్లు కానీ అనుమతించబడవని, పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్సు సెంటర్లు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడమే కాక పోలీసులు నిరంతర నిఘా ఏర్పాటు చేయనున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల ఆరోగ్య సమస్యలు దృష్టిలో పెట్టుకొని ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

ఆసరా అందలేదు..

● ఉత్తుత్తి బటన్ నొక్కుడేనా...? ● బటన్ నొక్కి నెలైనా అందని సాయం
● బ్యాంకుల చుట్టూ మహిళల ప్రదక్షిణలు ● చెక్కులు పంపిణీ చేసి చేతులు దులుపుకున్న ప్రజాప్రతినిధులు

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాం..

ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కిన రోజు నుంచి ఆసరా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాం. వీవోఏలను అడిగితే ఎస్సీ, బీసీ మహిళలకు జమ చేశారు. మీకు త్వరలో ఖాతాల్లో పడతాయని చెబుతున్నారు. నెల రోజులుగా ఇదే సమాధానం చెబుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చింది. ఇంకా ప్రభుత్వ పథకాల డబ్బులు జమ కావు అని కొందరు చెబుతున్నారు. ఇంతకు ఆసరా డబ్బులు మా గ్రూపు సభ్యుల అకౌంట్‌లో జమ అవుతుందో లేదో అధికారులే చెప్పాలి. ఎన్నికల కోడ్ వచ్చే ముందు బటన్ నొక్కడం కంటే ముందుగా వచ్చి ఉంటే మహిళలందరికీ మేలు జరిగి ఉండేది.

- డ్వాక్రా మహిళలు

అర్హుల జాబితాలో పేరు గల్లంతు..



గతంలో చేయూత పథకం కింద నా అకౌంట్‌లో డబ్బులు పడ్డాయి. వలంటీర్‌ను అడిగిన అన్ని పేపర్ జిరాక్స్‌లు ఇచ్చాము. అర్హుల జాబితాలో మా పేరు రాలేదని సచివాలయంలో అధికారులకు చెప్పాము. పేరు వస్తుంది ఇబ్బంది పడకండి అని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు వచ్చిన అర్హుల జాబితాలో నా పేరు లేదు. ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పేవారు లేరు. వస్తుందిలే ఏం కాదు అని అధికారులు చెబుతున్నారు.

- బుక్కే రేవతి, నల్లగుట్టపల్లె



సుండుపల్లె, మార్చి 17: ఎన్నికలొస్తున్నాయి. సీఎం బటన్లు నొక్కేస్తున్నా డబ్బులు మాత్రం లబ్ధిదారులు అకౌంట్లలో పడటం లేదు. దీంతో సీఎం ఉత్తుత్తి బటన్లు నొక్కుతున్నాడని పలువురు లబ్ధిదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. డబ్బులు ఎప్పుడు పడతాయని సంబంధిత అధికారులను అడిగితే ఇప్పుడే కదా అయ్యా గారు బటన్ నొక్కారు. నెలకో రెండు నెలలకో డబ్బులు పడతాయిలెండి అని అధికారులు చెబుతున్నారని లబ్ధిదారులు అంటున్నారు. నెల క్రితం బటన్ నొక్కినా ఆసరా సాయమే పూర్తి స్థాయిలో అందలేదు. వారం క్రితం బటన్ నొక్కినా చేయూత ఎప్పుడు చేతికందుతుందోనని లబ్ధిదారులు చర్చించుకుంటున్నారు. ఇది ఎన్నికల ముంగిట అధికార పార్టీ మాయాజాలమా అని మహిళలు చెప్పుకుంటున్నారు. సుండుపల్లె మండలంలో 996 పొదుపు సంఘాలు ఉన్నాయి. ఈ పొదుపు సంఘాలకు నాలుగో విడత రూ.6 కోట్ల 10 లక్షలు స్వయం సహాయక సంఘాల ఖాతాలకు జమ కావాలి. ఇది వరకు అన్ని వర్గాలకు ఒకేసారి ప్రభుత్వం నిధులు విడుదల చేసేది. మూడో విడత నుంచి ఆర్థికసాయం అందించడానికి ముప్పుతిప్పలు పడుతున్నారు. అందరికీ ఒకేసారి అందజేయడానికి అవసరమైన నిధులు లేక కులాల వారీగా లబ్ధిదారులను విభజించి వారి ఖాతాల్లో సొమ్ములు సర్దుబాటు చేస్తుండడంతో ఆసరా అందడంలో జాప్యం జరుగుతోంది. సీఎం బటన్ నొక్కేశారు కదా అని ఖాతా పుస్తకాలు పట్టుకుని రోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. నెల రోజులు దాటినా ఆసరా సొమ్ములు 35 శాతం లబ్ధిదారుల ఖాతాలకు ఇంకా చేరలేదని వాపోతున్నారు. సీఎం జగన్ జనవరి 23వ తేదీ ఆసరా డబ్బులకు సంబంధించి బటన్ నొక్కగా అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, అధికారులు అందరితో కలిసి పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలను మండల కేంద్రానికి తరలించి చెక్కును పంపిణీ చేశారు. చెక్కు అందజేసిన వెంటనే మండల వ్యాప్తంగా డ్వాక్రా మహిళల అకౌంట్లో నగదు జమ అవుతుందని పెద్దగా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కినా, ఇక్కడ ప్రజాప్రతినిధులు చెక్కు పంపిణీ చేసినా డ్వాక్రా సంఘాల గ్రూపుల్లో మాత్రం నగదు జమ కాలేదని మహిళలు వాపోతున్నారు.

సహాయం చేతికందడానికి ఇంకెన్ని రోజులో..

ఆసరా సొమ్ములే పూర్తిగా లబ్ధిదారులకు అందలేదు. వారం రోజుల తేడాతో చేయూత, ఈబీసీ నేస్తం బటన్లు నొక్కేశారు. ఏకంగా ముఖ్యమంత్రి బటన్లు నొక్కే కార్యక్రమంలో వారం తర్వాత డబ్బులు ఖాతాల్లోకి పడతాయని చెప్పారంటే నగదు ఖాతాల్లో పడడానికి ఇంకెన్ని రోజులు పడుతుందో, అసలు పడుతుందా అని కొంతమంది లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. ఎన్నికల షెడ్యూల్ వస్తే ఇబ్బంది అని కార్పొరేషన్ దగ్గర డబ్బు ఉన్నా, లేకున్నా సీఎం బటన్లు నొక్కేశారన్న విమర్శలు ఉన్నాయి. సుండుపల్లె మండలంలో ఈబీసీ నేస్తం అర్హులు 513 మందికి రూ.76,9500 నగదు జమ కావాల్సి ఉంది. వీళ్లే కాకుండా ఇంకా కొంతమంది అర్హుల పేర్లు జమ అయినట్లు ప్రాథమిక సమాచారం. చేయూత పథకం ద్వారా 2,683 మంది మహిళలకు ఒక్కో మహిళకు రూ.18,750 తమ ఖాతాల్లో జమ కావాలి. అయితే సీఎం బటన్ నొక్కి వారం పైన అవుతున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క మహిళ ఖాతాలోకి నగదు జమ కాలేదు. సీఎం బటన్ నొక్కారు కదా అని ఆశతో బ్యాంకుల వద్దకు వెళితే ఇంకా నగదు జమ కాలేదు అని బ్యాంకుల వారు చెబుతున్నారు. నిరాశతో మహిళలు వెనుతిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల కోడ్ వచ్చింది. నగదు పడుతుందా లేదా అని మహిళలు అయోమయంలో ఉన్నారు.

బటన్ నొక్కినా నగదు పడలేదు..



సీఎం బటన్ నొక్కినా ఈబీసీ నేస్తం నగదు అకౌంట్‌లో జమ కాలేదు. బ్యాంకు పుస్తకాలు తీసుకుని బ్యాంకు దగ్గరకు వెళ్లి నగదు పడిందా అని చెక్ చేస్తే పడలేదని చెబుతున్నారు. సచివాలయానికి వెళ్లి అధికారులను అడిగితే బటన్ నొక్కేశారు. పడతాదిలే తొందర ఏమని చెబుతున్నారు. ఎప్పుడు నగదు జమ అవుతుందో చెప్పండి.


- మాటూరి సుజాత,
ఈబీసీ నేస్తం అర్హురాలు, సుండుపల్లె

అందరికీ అందుతాయి..

ఆసరా లబ్ధిదారుల్లో చాలామందికి సహాయం అందింది. డ్వాక్రా సంఘాల అకౌంట్లో అమౌంట్ జమ అయింది. ఇంకా కొద్దిమందికి అందాల్సి ఉంది. త్వరలో అందరి ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చేయూత సొమ్ము వస్తుంది.

- శ్రీనివాసులు, ఏపీఎం, సుండుపల్లె






తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు



ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...



మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం...



కట్టుకున్నవాడే కడతేర్చాడు..!

● పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ (ఇన్‌సర్ట్)రమణమ్మ (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17: కట్టున్న భర్త కాలయము డిగా మారి భార్యను చున్నీతో గొంతు నులిమి చంపి, పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. మండలంలోని సీఐ జీవన్‌గంగనాథబాబు కథనం మేరకు కుర్నూతల పంచాయతీలోని బొమ్మేనపల్లెకు యోగానంరెడ్డి భార్య చనిపోవడంతో పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిప ల్లెకు చెందిన రమణమ్మను 8 ఏళ్ల క్రితం ద్వితీయ వివాహం చేసుకున్నాడు. వీరికి ఐదేళ్ల వయసున్న కూతురు ఉంది, వీరు తరచూ గొడవ పడేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున తన భార్యను చున్నీతో తన భార్య గొంతునులిమి చంపానంటూ పోలీసు స్టేషన్ కు వచ్చి లొంగిపోయాడు.ఎస్‌ఐ విష్ణువర్ధన్ సిబ్బందితో కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


బాలకృష్ణ మృతదేహం

పోరుమామిళ్ల, మార్చి 17 : అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కథనం మేరకు.. పోరుమామిళ్ల మండలం బాలిరెడ్డిపల్లెకు చెందిన బాలకృష్ణ (44) నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. మొక్కజొన్న, సద్ద వంటి పంటలు సాగు చేయగా, ఆశించినంత స్థాయిలో ఫలితం రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. దీంతో శనివారం రాత్రి పొలం వద్ద పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతనిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడు తిరుమలేశ్‌తో ఎస్‌ఐలు భక్తవత్సలం, లోకేశ్

రాయచోటిటౌన్, మార్చి 17: పట్టణ పరిధిలోని ఎస్టీ కాలనీలో రెండు రోజుల క్రితం తిరుపతమ్మ అనే మహిళ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడు తిరుమలేష్‌ను రాయచోటి అర్బన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేయడంతో పాటు, రూ1.7 లక్షలు రికవరీ చేశారు. రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. తన ఇంట్లో రూ.1.7 లక్షల నగదు చోరీకి గురైందంటూ తిరుపతమ్మ రెండు రోజుల క్రితం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్‌ఐలు భక్తవత్సలం, లోకేశ్‌లు దర్యాప్తు చేసి బాధితురాలి తమ్ముడు తిరుమలేశు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఆదివారం నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో చోరీ కేసును ఛేదించిన ఎస్‌ఐలు భక్తవత్సలం, లోకేశ్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్స్ జగన్, బర్కత్ తదితరులను అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ మహబూబ్‌బాషా అభినందించారు.

కోదండ రామాలయంలో భక్తులపై తేనెటీగల దాడి

ఒంటిమిట్ట, మార్చి 17: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఆదివారం తేనెటీగలు భక్తులపై దాడి చేశాయి. దీంతో దిక్కు తెలియని స్థితిలో ఉద్యోగులు, భక్తులు, సెక్యూరిటీ సిబ్బంది ఎవరికి వారుగా పరుగులు పెట్టడంతో ఏం జరుగుతుందో అని గందరగోళం నెలకొంది. ఈ దాడిలో నలుగురు భక్తులతో పాటు, టీటీడీ తాత్కాలిక సిబ్బంది , మరో అధికారి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో తేనెటీగలు దాడి చేసిన విషయం తెలిసినా అధికారులు తేనె తుట్టెల తొలగింపునకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు.

మైదుకూరు వాసికి గేట్‌లో ఆల్ ఇండియా 31వ ర్యాంక్


రామధీరజ్

మైదుకూరు, మార్చి 17 : గేట్ పరీక్షలో మైదుకూరుకు చెందిన గోశెట్టి రామధీరజ్ ఆల్ ఇండియా స్థాయిలో 31వ ర్యాంకు పొందారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఈ ర్యాంకు పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి తండ్రి గోశెట్టి రామచంద్రారావు 11వ బెటాలియన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు.

రాచమల్లుకు మద్దతిచ్చే ప్రసక్తేలేదు

● వైసీపీ సర్పంచ్ శివచంద్రా రెడ్డి


మాట్లాడుతున్న వైసీపీ సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 17: వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డికి మద్దతిచ్చే ప్రసక్తే లేదని రాబోయే ఎన్నికల్లో ఆయన ఓటమే లక్ష్యంగా పనిచేస్తానని వైసీపీ సర్పంచ్ కొని రెడ్డి శివచంద్రారెడ్డి ప్రకటించారు. ఆదివారం స్థానిక కొత్రపాడు రోడ్డులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీలో నేనొక్కడినే అసమ్మతివాదినని, అధిష్ఠానం నాతో చర్చించి కలిసి పనిచేయమని ఆదేశించినట్లు రాచమల్లు అవాస్తవాలు చెప్పాడన్నారు. అతనితో కలిసి వెళతానని తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. నా అవసరం లేదు నా ఓట్లు అక్కరలేదని మాట్లాడిన రాచమల్లు మళ్లీ అతనితో కలిసి వస్తా నని అబద్దాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఎమ్మెల్యేకు వ్యతి రేకంగా వార్డు ఉప ఎన్నిక విషయంలో నా సత్తా ఏమిటో చూపించానన్నారు. సజ్జల, అవినాష్, ధనుంజయరెడ్డి తనను పిలిపించిన మాట వాస్తవమేనని.. కానీ, వారితో కూడా రాచమల్లుకు వ్యతిరేకంగా పని చేస్తానని, అతనికి ప్రజల్లో అవినీతి పరుడు, దుర్మార్గుడుగా చెడ్డపేరుందని తెలి పానన్నారు. అసమ్మతి లేదని రాచమల్లు చెపుతున్న మాట వాస్తవం కాదన్నారు. ఆయన వెనక వుండే అతని ఓటమిని కోరు కుంటున్న వారు ఉన్నారన్నారు. త్వరలోనే అసమ్మతి వాదులంతా బయటికి వస్తారన్నారు. వైఎస్ కుటుంబంతో 30 ఏళ్ళ అనుబంధం తనదన్నారు. రాచమల్లు ఘోరంగా ఓడిపోతాడని జగన్‌కు చెప్పినా టికెట్టు ఇచ్చాడన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా రాచమల్లుతో కలిసే ప్రసక్తే లేదని.. అతని ఓటమే తమ లక్ష్యమన్నారు. త్వరలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి తన భవిష్యత్తును నిర్ణయించుకుంటానన్నారు.

కేజీబీవీలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 17 : ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాలలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకరావాని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 90 కేజీబీవీ పాఠశాలలు మంజూరు కాగా, వీటి నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుని సిబ్బందిని కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. కేజీబీవీ ప్రారంభమైనప్పటి నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు ఇందులో విధులు నిర్వహిస్తున్నారని, అయితే ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వీరికి సౌకర్యాలు లభించడంలేదన్నారు. ఇటీవల మోడల్ స్కూలు ఉపాధ్యాయుల సర్వీసును పరిగణించి ప్రభుత్వ సర్వీసు నిబంధనలు అమలు చేసిన విధంగా కేజీబీవీ సిబ్బందికి అమలు చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి


రామదాసు మృతదేహం

కాశినాయన, మార్చి 17: కాషాయ వస్త్రాలు ధరించిన ఓ వృద్ధుడు శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సుద్దమల గ్రామానికి చెందిన ఉమ్మడిశెట్టి రామదాసు (65)అనే వృద్ధుడు కొంతకాలంగా జ్యోతి క్షేత్రంలో ఉంటున్నాడు. అనారోగ్యంతో ఉన్న ఈయన అప్పుడప్పుడు నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేవాడు. అప్పుడప్పుడూ మద్యం దుకాణానికి వస్తూ పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇందులో భాగంగా శనివారం నర్సాపురం వచ్చిన రామదాసు రాత్రికి బాలరాజుపల్లె దారిలోని అంకాలమ్మ అరుగుపై పడుకొని అక్కడే చనిపోయి కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, బెంగుళూరులో ఉన్న అతని కుటుంబ సభ్యు లకు సమాచారం ఇచ్చినట్లు తెలి సింది. మృతుడి పొట్టపై రక్తగాయం ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై కాశినాయన మండల ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డిని వివరణ కోరగా, అనారో గ్యంతో ఉన్న రామదా సు కడుపునొప్పి తాళలేక మద్యం మత్తులో కత్తితో పొట్టపై గాయపరుచుకొని చనిపోయాడన్నారు.

యువకుడిపై వైసీపీ నేత దాడి.. నిర్బంధం

ప్రొద్దుటూరు , మార్చి 17 : అప్పుగా తీసుకున్న మొత్తానికి వడ్డీ చెల్లించలేదంటూ వైసీపీ నేత, అతని తల్లి తనను నిర్బంధించి దాడి చేశారని సృజన్ కుమార్ అనే యువకుడు ఆరోపించాడు. ఆదివారం ఉదయం రామేశ్వరంలోని చర్చి దగ్గర జరిగిన ఈ సంఘటనపై బాధితుడి తెలిపిన వివరాలిలా..

ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరానికి చెందిన సృజన్ కుమార్ అలియాస్ చందు అదే ప్రాంతానికి చెందిన రామేశ్వరం బుజ్జమ్మ అనే మహిళ నుంచి 5 రూపాయల వడ్డీకి కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. దానికి ప్రతినెల వడ్డీ చెల్లిస్తున్నాడు.ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో మూడు నెలల నుంచి వడ్డీ చెల్లించలేకపోయాడు. దీంతో బుజ్జమ్మ పలుమార్లు అతనిని దూషించడంతోపాటు భయభ్రాంతులకు గురిచేసింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చర్చికి వెళ్లి వస్తుండగా బుజ్జమ్మ, ఆమె కుమారుడు బెనర్జీ భర్త చెన్నయ్య సృజన్ కుమార్‌పై దౌర్జన్యానికి దిగారు. అతనిని చొక్కా పట్టుకుని తమ ఇంటికి తీసుకెళ్ళి నిర్బంధించి దాడి చేశారు. డబ్బు ఎగరగొట్టాలని చూస్తే నందం సుబ్బయ్యను చంపినట్లు చంపేస్తామని బెదిరించారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సృజన్ కుమార్‌ను నిర్బంధించిన విషయం తెలుసుకున్న అతని తల్లి దండ్రులు బెనర్జీ ఇంటి వద్దకు చేరుకుని కుమారుడిని రక్షించుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బెనర్జీ అతని కుటుంబసభ్యులతో తమకు ప్రాణహాని ఉందని బాధితుడి తండ్రి మోషా ఆరోపించారు. కాగా, బాకీ డబ్బులు అడిగినందుకు మోషా అతని కుటుంబసభ్యులు ఇంటి వద్దకు వచ్చి తమను దూషించారని రామేశ్వరం బుజ్జమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వైభవంగా గంగమ్మజాతర మహోత్సవం





గంగమ్మజాతరలో భక్తుల సందడి, (ఇన్‌సెట్లో) అమ్మవారి మూలవిరాట్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17: రాయలసీమకే తలమానికంగా నిలిచిన అనంతపురం గంగమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జాతర ముగిసిన మొదటి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు, మొక్కుబడులు చెల్లించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యానిర్వహణాధికారి రవీంద్రరాజు, చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి వెండి గొడుగు వితరణ

అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి పాత కడపకు చెందిన సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు 126 తులాల వెండి గొడుగును ఆదివారం ఆలయ ఈఓ రవీంద్రరాజుకు అందజేశారు. దీని విలువ రూ.11 వేలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17: మండలంలో నేటి నుంచి జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ చక్రేనాయక్ తెలిపారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 115 మంది, జడ్పీబాలుర పాఠశాలలో 120 మంది, ఏపీ మోడల్ పాఠశాలలో (ఏ)లో 150 మంది, ఏపీ మోడల్ స్కూల్లో (బి)లో 150 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని ఆయన తెలపారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. ఎస్ఐ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పెనగలూరు: పది పరీక్షలకు మండలంలోని మూడు కేంద్రాల్లో నేటి నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల కోసం ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఎంఈవో-1 గిరివరదయ్య, ఎంఈవో-2 టి.నాగసుబ్బరాయుడులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు ఎంఆర్సీలో టెన్త్ ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆదర్శ పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటిలాగే చక్రంపేట ఉన్నత పాఠశాలలో మూడవ కేంద్రం నడుస్తుందన్నారు. ఆదర్శ పాఠశాల ఏ కేంద్రానికి షకీలాబేగం, బీ కేంద్రానికి బాస్కర, చక్రంపేట కేంద్రానికి బచిత్‌సింగ్‌లను ప్రభుత్వం చీఫ్‌లాగా నియమించిందన్నారు.

రామాపురం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి ఈ నెల 28వ తేది వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రామకృష్ణుడు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 13 పాఠశాలల నుంచి 384 మంది విద్యార్థినీ, విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తున్నారన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి చీఫ్‌లుగా చంద్రశేఖర్, బషీర్ అహ్మద్, డిపార్టుమెంట్ ఆఫీసర్ రమణారెడ్డి, నారాయణ ఈ పరీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

రైల్వేకోడూరు: టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ పోతురాజు రామయ్య తెలిపారు. రైల్వేకోడూరులో మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 1440 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. ఇందుకు సబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పరీక్షా పత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచామన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఆలస్యం లేకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు.

చిట్వేలి: పదవ తరగతి పరీక్షలకు అధికారులు పటిష్టంగా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు చిట్వేలి 492, వెంకటరాజుపల్లె 200 మంది పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని అందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



ఇంటింటి ఎన్నికల ప్రచారంలో హరితరెడ్డి

చిన్నమండెం, మార్చి 17: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితరెడ్డి అన్నారు. మండలంలోని కలిబండ గ్రామ పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రాంప్రసాద్‌రెడ్డి సోదరి శ్రీలత రెడ్డి, తల్లీ సుశీలమ్మలతో పాల్గొని ప్రలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రచారానికి విచ్చేసిన సందర్భంగా మండిపల్లి కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచాలు కాలుస్తూ మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. నాగూర్‌వాండ్లపల్లె, బోటుకిందకాలనీ, పులిగీసినవాళ్లపల్లె ఇంటింటికి వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు తరలిన నేతలు

రాజంపేటటౌన్, మార్చి 17: ఆదివారం చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభకు రాజంపేట నియోజకవర్గ నేతలు పెద్దఎత్తున తరలివెళ్లారు. రాజంపేట, నందలూరు, సిద్దవటం, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట ప్రాంతాల నుంచి ఆ ప్రాంతాల ప్రధాన నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రజాగళం సభలో పాల్గొన్న రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, పట్టణ మాజీ టీడీపీ అధికారులు సంజీవరావు తదితరులు మాట్లాడారు. ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందని, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం ఖాయమైందన్నారు.

ఎన్నికల నియమావళిపై పకడ్బందీ చర్యలు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీఎస్పీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీఎస్పీ, పాల్గొన్న అధికారులు

రాజంపేట, మార్చి 17: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా రాజంపేట ప్రాంతంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రాజంపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు, డీఎస్పీ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆదివారం రాజంపేట రైల్వేస్టేషన్, బస్టాండు మండల పరిషత్ కార్యాలయ ఆవరణం, ప్రధాన రైల్వేస్టేషన్ ప్రాంతాలను తనిఖీ చేశారు. అంతకముందు ఎన్నికల నియోజకవర్గ అధికారులతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాభవనంలో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు, డీఎస్పీ కృష్ణ చైతన్యలు మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన 24 గంటల్లోపే ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలు, విగ్రహాలు, ప్రభుత్వ భవనాల, ప్రహరీగోడలపై ఉన్న కటౌట్‌లు, బ్యానర్లు, జెండాలు, వాల్ పెయింటింగ్‌లను తక్షణం తొలగించాలని ఆదేశించారు. పబ్లిక్ ఆస్తులైన బస్టాండు, రైల్వేస్టేషన్, ప్రభుత్వ టెలిఫోన్ స్తంభాలు, ఎలక్ట్రికల్ స్తంభాలు రాజకీయ పార్టీలకు సంబంధించిన చిహ్నాలు, పోస్టర్లు, గోడరాతలు వెంటనే తొలగించాలన్నారు. ప్రైవేటు ఆస్తులపై ప్రదర్శించిన అనధికార రాజకీయ ప్రకటనలను 72 గంటల్లోపు తొలగించాలన్నారు. అధికారిక మాస్ మీడియాను తమ రాజకీయ ప్రకటనల కోసం దుర్వినియోగం చేయడాన్ని నేరంగా పరిగణిస్తామన్నారు. మద్యం, నగదు, డ్రగ్స్ అక్రమ రవాణాను తనిఖీ చేయడానికి ఎక్సైజ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే సంసిద్ధం చేశామన్నారు. 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే 24 గంటల్లోపు పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట తహశీల్దారు ఇన్బనాదన్, కమిషనర్ రాంబాబు, ఆర్టీసీ డీఎం రమణయ్యలతో పాటు పోలీసు అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

● రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు



గోరాన్‌చెరువు బహిరంగ సభలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, మార్చి 17: నాకు ఒక్క అవకాశం ఇస్తే.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లెలో కసిరెడ్డి వెంకటశివారెడ్డి, మల్లికార్జునలు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో వీరిరువురూ తమ అనుచర వర్గంతో సైకిల్ ఎక్కారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ప్రభుత్వంలో ప్రజలు అన్ని రకాలుగా మోసపోయారని, సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలైన పోలీస్‌స్టేషన్లు, గ్రామ సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాలను వైసీపీ కార్యాలయాలుగా మార్చి వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఎమ్మెల్యే అరాచకాలకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. మండలంలోని వెలిగల్లు జలాశయం ప్రధాన కాలువ లైనింగ్ పనులు పూర్తి చేయకుండా అప్పటి కాంట్రాక్టర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చేతివాటం ప్రదర్శించి కాలువలు గాలికొదిలేయడంతో చివరి ఆయకట్టుకు నీళ్లందక రైతులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అరాచక పాలన నుంచి ప్రజలు బయట పడాలంటే చంద్రబాబును సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు.

టీడీపీలో చేరిన పలువురు వైసీపీ నాయకులు

గోరాన్‌చెరువు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం కసిరెడ్డి శివారెడ్డి, మల్లికార్జునలు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వైసీపీ పార్టీకి సేవలందించిన తమకు న్యాయం చేయకపోగా తమపైనే కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన ఘనత ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. బీసీలకు నిజంగా న్యాయం జరిగేది తెలుగు దేశం పార్టీలో మాత్రమేనని గుర్తుకు చేశారు.

టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీ కుటుంబాలు

రాయచోటిటౌన్, మార్చి 17: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు అలీమాబాద్ వీధిలో తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు జాబీర్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశ సభకు ముఖ్య అతిథిగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అలీమాబాద్‌వీధికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో కేవలం భూదందాలు, ఇసుక మాఫియా తప్ప అభివృద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీనివాసులరెడ్డి, జాఫర్‌అలీ, జబీర్, ఖదీర్, మస్తాన్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో...

గంగమ్మ తల్లీ... ప్రజలందరినీ చల్లంగా చూడు తల్లీ అంటూ రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని రాయుడుకాలనీలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకులు మడితాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గంగమ్మ జాతర ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.

బాధితుడికి న్యాయం చేయండి

● ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ డిమాండ్

రాయచోటిటౌన్, మార్చి 17: భార్య, ఆమె బాయ్‌ఫ్రెండ్ నుంచి ప్రాణభయం ఉందని రాయచోటి పట్టణం గాంధీబజారుకు చెందిన పసుపులేటి కిశోర్‌కుమార్ గత పది రోజులుగా కనిపించకుండా పోయిన విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో పెద్ద మనుషుల చుట్టూ తిరుగుతూ తన భార్యకు రాయచోటి కోర్టులో విడాకులు కేసు నమోదు చేసుకున్నాడని, కానీ రాయచోటి అర్బన్ పోలీసులు బలవంతంగా అతన్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాజీ కుదిర్చే ప్రయత్నం చేయడంతో కిశోర్‌కుమార్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్ ఆరోపించారు. బాధితుడికి న్యాయం చేసి, ఇందుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా దీనిపై ఎస్ఐ భక్తవత్సలంను వివరణ కోరగా, పసుపులేటి కిశోర్‌కుమార్ గత నెల రోజులుగా కనిపించకుండా పోవడంతో అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. అతని ఆచూకి తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి భార్య, భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపామని తెలిపారు. కానీ అతను కేసు నుంచి తప్పించుకునేందుకే ఆత్మహత్య ప్రయత్నం చేసి కేసు పక్కదోవ పట్టిస్తున్నాడన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సంబేపల్లె, మార్చి 17: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ సూపరిండెంట్ రెడ్డెయ్యరెడ్డి, డిపార్టుమెంటల్ ఆఫీసర్ మార్ల ఓబుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సంబేపల్లె జడ్పీ హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వీరికి పరీక్షల నిర్వహణ సామాగ్రితో పాటు డెస్కులు, ఫ్యాన్‌లు, లైట్లు, తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస అవసరాల సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పించినట్లు తెలిపారు. పోలీసుల పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థి నుంచి అధికారి వరకు ఎవ్వరికీ సెల్‌ఫోన్‌కు అనుమతి లేదన్నారు. విద్యార్థులు ఎవ్వరూ ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, చిట్టీలు పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకొని రావద్దని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా, కట్టుదిట్టంగా నిర్వహిస్తామన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్

పలువురు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన రైల్వేకోడూరు యువకులు

రైల్వేకోడూరు, మార్చి 17: టీడీపీ యువనేత ముక్కా సాయివికాస్ రెడ్డి సమక్షంలో ఆదివారం రైల్వేకోడూరు పట్టణంలోని న్యూక్రిష్టానగర్‌కు చెందిన పలువురు యువకులు భారీ ఎత్తున టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల పొత్తు చారిత్రాకంగా నిలిచిపోతుందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని, అభ్యర్థి ఎవరైనా వారి గెలుపు కోసం యువత పాటు పడాలని కోరారు.

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు, కొర్లకుంట నుంచి టీడీపీలోకి భారీ సంఖ్యలో చేరికలు జరిగాయి. ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి నేతృత్వంలో రైల్వేకోడూరు, కొర్లకుంటకు చెందిన కార్యకర్తలు, నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఎన్నికల నియమాలను పాటించాలి



ఫ్లెక్సీలను తొలగిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

గాలివీడు, మార్చి 17: రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో ఎన్నికల నియమావళి అమల్లో ఉందని, రాజకీయ పార్టీల నాయకులు అందరూ తూచా తప్పకుండా ఎన్నికల నియమాలను పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను, బోర్డింగ్‌లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అమలు చేసే విధి విధానాలను ప్రతిఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. ఎవరైనా ఏ రాజకీయ పార్టీ అయినా, నాయకులైనా ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ గ్రామ పంచాయతీల్లో ఉన్నటువంటి పోస్టర్లను, ఫ్లెక్సీలను తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో జాబీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతల వాల్‌పోస్టర్లు, బ్యానర్లు తొలగింపు



సంబేపల్లె బస్టాప్ వద్ద బ్యానర్లు తొలగిస్తున్న దృశ్యం

సంబేపల్లె, మార్చి 17: దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల, బస్టాప్‌ల వద్ద ప్రభుత్వ ఆస్తుల వద్ద ఉన్న వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, జెండాలను తొలగించాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించింది. దీంతో ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు సంబేపల్లెలో అధికారులు వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న పోస్టర్లను జెండాలను తొలగిస్తున్నారు. సంబేపల్లె బస్టాప్ వద్ద వీఆర్వో ఈశ్వరయ్య, పంచాయతీ సెక్రటరీ రవీంద్ర తమ సిబ్బందితో పోస్టర్లను తొలిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన 24 గంటల్లోనే రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలని ఈసీ ఆదేశించింది. ఈసీ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నిర్మలాకుమారి మండల వ్యాప్తంగా రాజకీయ పార్టీలకు చెందిన పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు తొలగించాల్సిందిగా తమ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో మండల వ్యాప్తంగా ఉన్న బ్యానర్లు, పోస్టర్లు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.

రైల్వేకోడూరు: ఎన్నికల కోడ్ రావడంతో శనివారం సాయంత్రం నేతల విగ్రహాలకు ముసుగులకు తొడిగారు. కొన్ని బ్యానర్లు తీసివేశారు. ఆదివారం ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సిద్ధం బొమ్మలను పీకేశారు. పెద్ద, పెద్ద బ్యానర్లు, హోర్డింగులు తొలగించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బ్యానర్లు తీసివేశారు. గోడలకు రాసిన రాతలకు సున్నం పూశారు. చెట్లకు ఉన్న బ్యానర్లు తీసివేశారు. డివైడర్ల మధ్యలో ఉన్న బ్యానర్లను తీసివేశారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఫొటోలను తొలగించారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 17: పట్టణంలోని జామియా మసీదులో ఆదివారం టీడీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ జుబేర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ముస్లిం పవిత్ర మాసం రంజాన్ ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం పుణ్యకారమని పేర్కొన్నారు. ప్రతి ముస్లింలకు తమ చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసే మాసం రంజాన్ మాసం అని తెలిపారు. కార్యక్రమంలో పఠాన్ మౌలా బాషా, అహ్మద్, మస్తాన్, మసీదు మత పెద్దలు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యం



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నందలూరు, మార్చి 17: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యమని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ అన్నారు. రాజంపేట నియోజకవర్గ పరిధిలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు తాము న్నామని భరోసా ఇస్తూ మండలంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని అరవపల్లె, ఆర్ఎస్ రోడ్డు, తోటపాలెం, గాంధీనగర్, నందలూరు పంచాయతీలో ఎస్ఎస్‌బీ డీఎస్పీ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులతో సోమవారం కవాతు నిర్వహించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ వి.ఎన్.కె.చైతన్య, మన్నూరు సీఐ మంజునాథరెడ్డి, ఆదేశాల మేరకు ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

17 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మార్చి 17: రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 17 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని రాయచోటి నియోజకవర్గంతో పాటు పీలేరు, కదిరి, కేవీపల్లె, కలకడ, కలికిరి, గుర్రంకొండ, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో 17 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 28 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, చెన్నూరు అన్వర్‌బాషా, శివరామిరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మ తల్లికి బోనాలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ తల్లి మూలవిరాట్

సుండుపల్లె, మార్చి 17: మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలో వెలిసిన నాగారపమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులు సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

రామాపురం, మార్చి 17: కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని బండపల్లి సమీపంలో ఎలాంటి పర్మిట్ లేకుండా అక్రమంగా ఇసుకను రాయచోటి వైపు తీసుకువెళ్తుండగా ఆదివారం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనంతరం డ్రైవర్, ఓనర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్ నిత్యం ట్రాక్టర్ పర్మిట్లు, నెంబరు ప్లేటు లేని ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుకతో రవాణా చేయడానికి హసనాపురం పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలో ఉన్న వంకల్లో నుంచి ఇసుకను తరలిస్తుండేవారన్నారు. తమకు సమాచారం రావడంతో బండపల్లి బస్టాప్ సమీపానికి వెళ్లగానే ట్రాక్టర్లను అదుపు చేసుకొని ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

ఓబులవారిపల్లె, మార్చి 17: మండలంలోని ఎల్లాయిపల్లె గ్రామ పరిధిలో నాటుసారా అమ్ముతున్న ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా నాటుసారాతో ఇరువురు పట్టుబడడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు



ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్టుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. - చిలకలూరిపేట




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..




జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..



గురజాల గెలుపునకు కృషిచేయండి!

● డీఏ శ్రీనివాస్‌కు చంద్రబాబు సూచన


చంద్రబాబుతో మాట్లాడుతున్న డీఏ శ్రీనివాస్

చిత్తూరు సిటీ, మార్చి 17: చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ గెలుపునకు కృషిచేయాలని డీఏ శ్రీనివాస్‌కు చంద్రబాబు సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఒక వివాహ వేడుకలో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, డీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా గురజాల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషిచేయాలని ఆయన సూచించినట్లు తెలిసింది.

పోలింగ్ తర్వాత రోజే చిత్తూరు జాతర

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మే 13వ తేదీన జరగనుంది. ఆ తర్వాత రోజునుంచి చిత్తూరు గంగజాతర జరగనుంది. దీనివల్ల బందోబస్తుకు పోలీసు యంత్రాంగం ఇబ్బంది పడనుంది. 13వ తేది ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఒకవేళ ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే మే 14న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ ఉండొచ్చు. ఇక, ఏటా మేనెల మూడో మంగళ, బుధవారాల్లో జాతర జరగడం 300 సంవత్సరాలకు పైబడి ఉంది. ఈసారి మే 14, 15 తేదీల్లో చిత్తూరు, గిరింపేట, సంతపేట, కట్టమంచి, కొంగారెడ్డిపల్లి, దొడ్డిపల్లిలతో పాటు సరిహద్దు గ్రామాల్లో గంగజాతర జరుగుతుంది. కాగా, మే 13న పోలింగ్ కోసం పోలీసు యంత్రాంగం ఒక్క రోజు ముందుగానే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్ళాల్సివుంటుంది. పోలింగ్ అనంతరం మరుసటి రోజు గంగజాతరకు డీఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు వందల సంఖ్యలో పోలీసులు బదోబస్తుకు రావాలంటే ఇబ్బంది పడే అవకాశముంది.

తమిళనాడు సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్ఐలు

పాలసముద్రం, మార్చి 17: ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పాలసముద్రం మండలం బలిజకండ్రిగ వద్ద పళ్లిపట్టు - షోలింగర్ రోడ్డుపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆదివారం ఏర్పాటు చేశారు. పాలసముద్రం ఎస్ఐ భారతి, కార్వేటినగరం ఎక్సైజ్ ఎస్ఐ భారతి తమ సిబ్బందితో ఆచెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా పాలసముద్రం ఎస్ఐ మాట్లాడుతూ తమిళనాడు నుంచి మద్యం, నగదు వంటివి తరలించకుండా చెక్‌పోస్టును ఏర్పాటు చేశామ న్నారు. ఎలాంటి అక్రమ రవాణా జరిగినా ఉపేక్షించేంది లేదని స్పష్టంచేశారు. 24 గంటలూ తనిఖీలు నిర్వహిస్తారని తెలియజేశారు.

శ్రీవారి తెప్పోత్సవాలకు జోరుగా ఏర్పాట్లు

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో ఉత్సవర్లు విహరించే తెప్పను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. నీటిపై గాలితో కూడిన డ్రమ్ములను ఏర్పాటు చేసి, దానిపై మండపం రూపంలో ఉండే తెప్పను నిర్మించి.. రంగులు అద్దుతున్నారు.

ఏ రోజు ఎలా.. : తొలిరోజున సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రమూర్తి తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండో రోజున రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై మూడుసార్లు విహరిస్తారు. మూడో రోజున శ్రీభూ సమేతంగా మలయప్పస్వామి మూడుసార్లు పుష్కరిణిలో విహరించి, భక్తులను అనుగ్రహిస్తారు. నాల్గవ రోజున ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు.

కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో బీటెక్ విద్యార్థి దుర్మరణం

● మరో ఇద్దరికి గాయాలు




కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అక్షరాలు - సందీప్ మృతదేహం

తిరుచానూరు, మార్చి 17: ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జీవకోన చెందిన సందీప్(21) పుత్తూరులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం పుత్తూరు నుంచి ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని దామినేడు సమీపంలో జాతీయ రహదారిపై వస్తుండగా.. ముందు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేసింది. దీంతో ఈ కారును వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సందీప్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడమే ప్రమాదానికి కారణమని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దాంతో కారు డ్రైవర్‌ని అరెస్టు చేసి, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా, సందీప్ తల్లిదండ్రులు అక్కడికొచ్చి బోరున విలపించారు. మిగిలిన ఇద్దరు కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులు తెలిపారు.

ఇంతకీ ఈ కారెవరిది?

ప్రమాదానికి కారణమైన కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అనే అక్షరాలు ఉండటం గమనార్హం. ఈ కారు ఎవరిదన్న విషయంలో పోలీసులు గోప్యతను పాటిస్తున్నట్లు సమాచారం.

ముద్రగడా.. నోరు అదుపులో పెట్టుకో

● వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా పవన్ కల్యాణ్‌ని విమర్శించేది
● జనసేన తిరుపతి ఇన్‌చార్జి మండిపాటు


తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 17: 'ముద్రగడ పద్మనాభం.. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు.. వైసీపీలో నెల జీతానికి పనిచేసే నువ్వా మా అధినేత పవన్ కల్యాణ్‌ని విమర్శించేది' అంటూ జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మండిపడ్డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'జనసేనానికి రాజకీయ ఓనమాలు రావంటూ మాట్లాడే ముందు నీకు వచ్చుంటే.. నువ్వు, నీ కుమారుడు ఎందుకు పార్టీ పెట్టలేకపోయారు. జనసేన పార్టీ పని అయిపోయింది.. మూసేస్తారని నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. పవన్ కాపుల ద్రోహి అని మాట్లాడే ముందు నీ వెనుక ఎంతమంది కాపులున్నారో ఒకసారి చూసుకో. 2016-17లో చేపట్టిన కాపుల ఉద్యమంలో నువ్వు కాపులకు చేసిన నమ్మకం ద్రోహం అందరికీ తెలుసు. అలాంటి నువ్వు కాపుల ద్రోహి అంటూ మా నేతను విమర్శించడం హాస్యాస్పదంగా ఉంది. వైసీపీలో చేరేందుకు పిఠాపురం నుంచి తాడేపల్లికి వెళ్లిన నీ వెంట నీ కుమారుడు తప్ప ఎవరైనా వచ్చారా? అదేమంటే సెక్యూరిటీ ఇబ్బందులు ఉండటం వల్ల ఎవరినీ తీసుకురాలేదని సాకులు చెబుతావా? ఇక నా కుటుంబాన్ని నాశనం చేసింది చంద్రబాబు అంటూ ఈ రోజు ప్రచారం చేస్తున్నావు కదా.. మరి జగన్మోహన్‌రెడ్డి నీ కుటుంబానికి ఏం చేస్తానని హామీ ఇచ్చాడో చెప్పు చూద్దాం.. జగన్‌కి కాపలా కుక్కలా వ్యవహరిస్తున్న నువ్వా మా నేతను విమర్శించేది? ఇంకోసారి ఇలాంటి విమర్శలు చేస్తే సహించేది లేదు' అని కిరణ్ రాయల్ హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజారెడ్డి, బాబ్జి, హరికుమార్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో పారిశుధ్య కార్మికుల నిరసన

పీఎన్ఎస్ సంస్థ ఇబ్బంది పెడుతోందని ఆరోపణ



తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు సంస్థ అయిన పీఎన్ఎస్‌లో పని చేసే సుమారు 40 మంది పారిశుధ్య కార్మికులు తిరుమలలో ఆదివారం వేకువజామున నిరసన వ్యక్తం చేశారు. తమను ఇబ్బంది పెడుతోందని ఆరోపిస్తూ.. దానికింద పనిచేసే వీరంతా వైకుంఠం క్యూకాంప్లెక్స్, పద్మావతి ఏరియాలో విధులు బహిష్కరించారు. అనంతరం వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని కార్యాలయం ముందు బైఠాయించారు. అత్యవసర సమయంలో లీవ్ తీసుకుంటే విధులను నుంచి తొలగిస్తున్నారని, క్రిస్టియన్ల తరహాలో బొట్టు, పూలు, కాళ్లకు గొలుసులు వేసుకోవద్దంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని కూడా తగ్గించి పనిభారం పెంచేస్తున్నారని, కాసేపు సేద తీరితే ఫొటోలు తీసి.. విధులకు రావద్దని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇదేమని అడిగితే.. 'ఉంటే ఉండు.. లేకపోతే వెళ్లిపో' అంటున్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న టీటీడీ హెల్త్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోవడంతో హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరిస్తామని, విధులకు హాజరుకావాలని కోరారు. దాంతో కార్మికులు విధులకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పీఎన్ఎస్ సంస్థ నిర్వాహకులు తరచూ కార్మికులను వేధిస్తున్నారన్నారు. ఇకనైనా ఈ సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైకు

యువకుడి దుర్మరణం


హరిబాబు మృతదేహం

బంగారుపాళ్యం, మార్చి 17: ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు.బంగారుపాళ్యం పోలీసులు తెలిపిన ప్రకారం.. గంగవరం మండలం గుండగల్లు గ్రామానికి చెందిన హరిబాబు, శ్యామ్ బంగారుపాళ్యం మండలం కొరివారిపల్లె గ్రామంలోని ఓ ఇటుకల బట్టీలో పనిచేస్తున్నారు. శనివారం హరిబాబు తల్లికి ఆరోగ్యం బాలేక మాత్రలు తీసుకురావడానికి సత్రానికి ద్విచక్రవాహనంలో ఇద్దరూ బయలుదేరి వెళ్లారు. మాత్రలు తీసుకుని కొరివారిపల్లెకు వస్తుండగా కల్లూరుపల్లిలోని పొలంవద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన హరిబాబు, శ్యామ్‌ను చిత్తూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో హరిబాబు(23) మృతచెందాడు. కాగా శ్యామ్ తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం


పీటీఎం మోడల్ స్కూల్లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో నారాయణ

పెద్దతిప్పసముద్రం మార్చి 17 : పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌస్ పీర్‌లు తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కమ్మచెరువు, కందుకూరు, పులికల్లు, రంగసముద్రం, పీటీఎం (తెలుగు), పీటీఎం(ఉర్దూ), మోడల్ స్కూల్, కేజీబీవీ, బూర్లపల్లె, టి.సదుం పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు మొత్తం 324 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందులో పీటీఎం మోడల్ స్కూల్‌లో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మోడల్ స్కూల్‌లో కమ్మచెరువు, కందుకూరు, పీటీఎం (తెలుగు), పీటీఎం(ఉర్దూ), కేజీబీవీ, మోడల్ స్కూల్ లకు చెందిన విద్యార్థులు మాత్రం పీటీఎం సమీపంలోని మోడల్ స్కూల్ లో పరీక్షలు రాయనున్నారు. పులికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మొలకలచెరువులలో పరీక్షలు రాయనున్నారు. అదే విధంగా టి.సదుం, బూర్లపల్లె, రంగసముద్రం, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు బి.కొత్తకోటలో పరీక్షలు రాయనున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రంలో మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. ప్రతి విద్యార్థి తమ హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. పరీక్షా సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్, ఎలక్ట్రికల్ వస్తువులను తీసుకురావడం నిషేధించామన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ


విద్యార్థులకు స్టేషనరీ అందిస్తున్న బంజారా సంఘ నేతలు

పీలేరు, మార్చి 17: పీలేరులోని కేవీపల్లె ట్రైబల్ గురుకుల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బంజారా నాయకులు పరీక్ష సామగ్రి వితరణగా అందజేశారు. ప్రతి విద్యారికి ప్యాడు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేసర్లు వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు హరి నాయక్, చంద్రశేఖర్ నాయక్, అనిల్ నాయక్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పీలేరు, మార్చి 17: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినట్లు ఆర్టీసీ పీలేరు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. విద్యార్థులు వారి హాల్ టిక్కెట్లు చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని, వారి పరీక్షలకు అనుగుణంగా కొన్ని గ్రామీణ సర్వీసుల సమయాలను మార్పు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆయన విద్యార్థులను కోరారు.

డౌన్‌లోడ్ హాల్ టికెట్లకు ఎలాంటి ధృవీకరణ అవసరం లేదు

కలికిరి, మార్చి 17: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు విద్యా శాఖ వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే హాల్ టికెట్లకు ప్రధానోపాధ్యాయుల ధృవీకరణ సంతకం (అటిస్టేషన్) అవసరం లేదని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరేట్ స్పష్టం చేసింది. ఈ మేరకు డైరెక్టరు డి. దేవానంద రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 4 నుంచి పదో తరగతి విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో వుంచారు. ఆయా ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేయాలని గతంలో ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాకుండా విద్యార్థులు సైతం తమ పేరు, పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్‌లో నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయితే తాజాగా ఇలా వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే హాల్ టికెట్లకు ప్రధానోపాధ్యాయుల ధృవీకరణ అవసరం లేదని ఉత్తర్వులు జారీ చేస్తూ ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలను డైరెక్టరు ఆదేశించారు. డౌన్‌లోడ్ హాల్ టికెట్లతో హాజరయ్యే విద్యార్థులను అనుమతించాలని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

కేజీబీవీలలో 6వతరగతికి దరఖాస్తుల ఆహ్వానం

నిమ్మనపల్లి, మార్చి 17: మండలంలోని ముష్టూరు పంచాయతీలో గల కస్తూరిబా పాఠశాలలో 2024-25 సంబంధించి 6వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ తెలిపారు. 6వతరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో చేరే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు. ఆధార్‌కార్డు. రేషన్‌కార్డు, ఫోన్‌నెంబరు, తల్లిదండ్రుల ఆధార్, బదిలీ సర్టిఫికెట్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేయాలన్నారు. ముఖ్యంగా బడి బయట పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్‌లు, దారిద్రరేఖకు దిగునవున్న పిల్లలు ఎస్సీ, ఎస్టీ పిల్లకు మొదటి అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ గడువు ఏప్రిల్ 12వ తేదీగా ఉందని తెలిపారు.

ఆవిష్కార్‌లో మిట్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

కురబలకోట, మార్చి 17: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆవిష్కార్ పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో (డేటా సైన్స్)తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన జాతీయస్థాయి ఆవిష్కార్- స్టూడెంట్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ ఫర్ స్టార్ట్ అప్ ఐడియా ప్రెజెంటేషన్ ఈవెంట్ పోటీలలో సాంబశివ, సాయి బాలాజీ, సాయిత్రిలోక్‌లు వెండిటోర్ రీఫైనింగ్ రీటైల్ అనుఅంశంపై ఐడియా ప్రెజెంటేషన్‌ను ప్రదర్శించారు. కాగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనకు జాతీయస్థాయిలో 5వస్థానం దక్కింది. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను మెమెంటోలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి కుసుమ తదితరులు అభినందించారు.

ఎన్నికల్లో జయచంద్రారెడ్డిని గెలిపించుకుంటాం

● మిత్రుడి కోసం 32 ఏళ్ల తురువాత కలిసిన పూర్వ విద్యార్థులు ● ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శ్రమిస్తామని వెల్లడి


టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి గెలుపుకు కృషి చేస్తామని విజయ సూచిక చూపుతున్న స్నేహితులు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 17: కష్టపడి పనిచేస్తాం...తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అయిన తమ స్నేహితుడు దాసరిపల్లి జయచంద్రారెడ్డిని గెలిపించుకుంటామని పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో దాసరిపల్లి జయచం ద్రారెడ్డితో పాటు 1991-92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో కలుసుకున్నారు. తమ మిత్రుడికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం వచ్చినందుకు 32 ఏళ్ల తురువాత మళ్ళీ ఇప్పుడు కలిశారు. తమతో పాటు చదువుతున్న స్నేహితుడు జయచంద్రారెడ్డికి తంబళ్ళపల్లె టీడీపీ అభ్యర్థిగా అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని, పార్టీల కతీతంగా విజయం సాధించేందుకు తమ వంతు శ్రమిస్తామని వెల్లడించారు. ప్రచా రంలో కూడా పాల్గొని తమతో పాటు తెలిసిన వారికి, బంధువులకు, కుటుంబీకులకు చెప్పి ఓట్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. తమ స్నేహితుడ్ని గెలిపించుకునేందుకు బాధ్యతగా తీసుకుంటామని చెప్పారు. సుమారు 60 మందికి వరకు స్నేహితులు అందరూ కలిసి వచ్చి మద్దతుగా నిలిచారు. తన స్నేహితులు మద్దతు ప్రకటించడంతో జయచంద్రారెడ్డి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. దీంతో పార్టీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు కల్పనరెడ్డి, సుజాత, రాజేశ్వరి, షాజహాన్, భవానీ, అయిషా, హరిత, అమరావతి, లక్ష్మీ, కళావతి, వాణి, బొగ్గు మునీర్, అయూబ్, రామకృష్ణ, జాన్, రమణప్ప, చంద్రశేఖర్, మాధవరెడ్డి, రియాజ్, జయచంద్రా, షామీర్, రమణ, మహేష్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

మీ సహకారాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటా

● తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

కలిసి చదువుకున్న మిత్రులందరూ అందిస్తున్న సహాయసహకారాలను జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రా రెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో మిత్రులతో ఆయన మా ట్లాడుతూ తనతో పాటు చదుకున్న మిత్రులు వచ్చి మద్దతు ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని రైతులందరూ తల ఎత్తుకు జీవించేలా హంద్రీ - నీవా జలాలను ఉపకా లువల ద్వారా ప్రతి చెరువుకు, కుంటకు తెచ్చి నీటితో నింపడమే ధ్యేయంగా పెట్టుకున్నా నన్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా టమోటాలు పండిస్తారని, రైతుల కోసం టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడ్యార్ ఏర్పాటుకు కృషి చేసి నిరుద్యోగాన్ని రూపుమాపుతానన్నారు. తంబళ్లపల్లె నియోజ కవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచి పేదరికం లేకుండా చేస్తానన్నారు.

కేంద్ర సాయుధ దళాలకు సూచనలు


కేంద్ర సాయుధ బలగాలకు సూచనలిస్తున్న అధికారులు

కలికిరి, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కలికిరి పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలకు పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ ఫర్మాన్ అహ్మద్, డీఎస్పీ మహబూబ్ బాషాలు సూచనలు, సలహాలనిచ్చారు. అనంతరం స్థానిక యల్లమ్మ ఆలయం వద్ద బలగాలు ఉన్నతాధికారుల ఆదేశాలు తీసుకుని కవాతును ప్రారంభించారు. అక్కడి నుంచి మదనపల్లె మార్గంలోని ఇందిరమ్మ కాలనీ వరకూ పట్టణ ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. స్థానిక పోలీసులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలకు ఆస్కారం కల్పించబోమని ఓటర్లకు మనోధైర్యం కలిగించడానికి ఈ కవాతు నిర్వహించారు.

డీలర్లకు కమీషన్‌ను వెంటనే చెల్లించాలి

పీలేరు, మార్చి 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పీడీఎస్ డీలర్లకు రావాల్సిన గోనె సంచుల పైకం, కమీషన్లను వెంటనే చెల్లించాలని పీలేరు చౌకదుకాణాల డీలర్ల సంఘ కార్యదర్శి పసుపులేటి వెంకటరమణ డిమాండ్ చేశారు. పీలేరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్ల వద్ద నుంచి గోనె సంచులను పైకం చెల్లిస్తామని నిర్బంధంగా తీసుకున్నాయని, ఇంత వరకు ఆ పైకం చెల్లించలేదన్నారు. ఆ పైకంతోపాటు ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న తమ కమీషన్‌ను కూడా చెల్లించాలని ఆయన కోరారు.

తంబళ్లపల్లె సివిల్ కోర్టు ఏజీపీగా నాగమల్‌రెడ్డి



తంబళ్లపల్లె, మార్చి 17: తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపి)గా మండలంలోని వేమారెడ్డిగారిపల్లెకు చెందిన నాగమల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీపీగీ నాగమల్‌రెడ్డి నియామకం పట్ల న్యాయవాదులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 17:మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఆలయంలో ఉదయాన్నే అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా గంగమ్మజాతర మహోత్సవం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17: రాయలసీమకే తలమానికంగా నిలిచిన అనంతపురం గంగమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జాతర ముగిసిన మొదటి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు, మొక్కుబడులు చెల్లించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యానిర్వహణాధికారి రవీంద్రరాజు, చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి వెండి గొడుగు వితరణ

అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి పాత కడపకు చెందిన సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు 126 తులాల వెండి గొడుగును ఆదివారం ఆలయ ఈఓ రవీంద్రరాజుకు అందజేశారు. దీని విలువ రూ.11 వేలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాగారపమ్మ తల్లికి బోనాలు

సుండుపల్లె, మార్చి 17: మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలో వెలిసిన నాగారపమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులు సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి


మదనపల్లె పట్టణంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీ బోర్డును తొలగింపజేస్తున్న ఆర్డీవో హరిప్రసాద్, కమిషనర్ ప్రమీల

మదనపల్లె టౌన్, మార్చి 17: మదనపల్లె నియోజకవర్గంలో ఎంసీసీ అధికారులు ఎన్నికల కోడ్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని ఆర్డీవో హరిప్రసాద్ ఆదేశించారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్(పట్టణ ఎంసీసీ అధికారి) ప్రమీలతో కలసి గొల్లపల్లె మీ సేవా కేంద్రం, ప్రభుత్వాస్పత్రి, టమోటా మార్కెట్‌యార్డు, అంబేద్కర్ సర్కిల్, చిత్తూరు బస్టాండు ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల వున్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు పాటించని రాజకీయ నాయకులకు నోటీసులు ఇవ్వాలని అలాగే ఎంసీసీ నిబంధనలను పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీవో విలేకర్లతో మాట్లాడుతూ 164 మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదులు చేయాలంటే టోల్ ఫ్రీ నెంబరు 18005990666 నెంబర్‌కు ప్రజలు ఫోన్ చేయవచ్చన్నారు.

బి.కొత్తకోటలో ఫ్లెక్సీలు..బ్యానర్లు తొలగింపు

బి. కొత్తకోట, మార్చి17: బి. కొత్తకోట నగరపంచాయతీలో ఎన్నికల అధికారులు ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించారు. పట్టణంలోని జ్యోతిచౌక్‌లో టీడీపీ, వైసీపీలతో పాటు ఇతర రాజకీయపార్టీలకు చెందిన ఫెక్సీలతో పాటు, నాయకుల బర్త్‌డేలు, ఆవిర్భావదినోత్సవాలు ఇలా అనేకరకాల బ్యానర్లతో నిండిపోయి వుండేది. ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో నగరపంచాయతీ కమిషనర్ పీఆర్ మనోహర్ పర్యవేక్షణలో సిబ్బంది వాటిని తొలగించారు.

కొన్నిచోట్ల ఇంకా అమలు కాని ఎన్నికల కోడ్


వాల్మీకిపురం సచివాలయం వద్ద ప్రజాప్రతినిధుల ఫొటోలతో ఉన్న శిలాఫలకం

వాల్మీకిపురం, మార్చి 17: ఎన్నికల కోడ్ వచ్చినా ఇంకా కొన్ని చోట్ల అమలుకు నోచుకోవడంలేదంటూ పలువురు పెదవివిరుస్తున్నారు. కోడ్ వచ్చిన 24 గంటల్లో నిబంధనలు పాటించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా మండల అధికారుల చర్యలు మాత్రం నామమాత్రమే. పట్టణంలో గ్రామ సచివాలయం ఎదుట శిలాఫలకంలో ప్రజాప్రతినిధుల ఫొటోలు ఉన్నా అధికారులు వాటిని పట్టించుకోకపోవడం గమనార్హం. మండలం వ్యాప్తంగా అక్కడక్కడా ఇలాంటి సంఘటనలు ఉన్నట్లు ప్రజలు సైతం విమర్శలు చేస్తున్నారు.



రామసముద్రంలో సచివాలయంపై ఉన్న సీఎం జగన్ ఫొటో

రామసముద్రంలో: రామసముద్రం మండల కేంద్రంలో అధికారులు ఎన్నికల కోడ్‌ను పట్టించుకోలేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. కోడ్ నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధులు, మంత్రులు, ముఖ్యమంత్రి ఫొటోలు ప్రభుత్వ కార్యాల యాలలో ఉండకూడదనే నిబంధనలు ఉన్నా మండల కేంద్రంలో ఎగువచెక్‌పోస్టు వద్ద నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలకు నవరత్నాల పేరిట ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్ తొలగించకుండా అలాగే ఉంచారు. ఎన్నికల ఉన్నతాధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మదనపల్లెఅర్బన్, మార్చి 17: మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లి(50)అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు నిమ్మనపల్లె రోడ్డు సర్కిల్‌కు చెందిన మల్లి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోర్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అపస్మారక స్థితిలో గర్భిణి మృతి

మదనపల్లె టౌన్, మార్చి 17: ఉదయం వరకు చలాకీగా తిరుగుతున్న ఓ గర్భిణీ వున్నటుండి అపస్మారక స్థితితో చేరుకుని మృతి చెందింది. రామసముద్రం మండలం ఆల్వేపల్లెకు చెందిన దేవరాజుకు, నిమ్మనపల్లె మండలం కుమ్మరపల్లెకు చెందిన మహిత(22)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి తొలి కాన్పులో కుమారుడు గౌతమ్(4) పుట్టగా ఆనారోగ్యంతో మృతి చెందాడు. దేవరాజు హైదరాబాద్‌లో ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తుండటంతో ఈ క్రమంలో మహిళ రెండోసారి గర్భిణి కావడంతో వారం రోజుల క్రితం పుట్టినింటికి వచ్చింది. ఆదివారం ఉదయం మహిళ ఉన్నట్టుండి కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబీకులను ఆమెను కారులో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహిళను పరీక్షించిన వైద్యులు ఆమె మార్గమధ్యంలోనే మృతి చెందిందని నిర్ధారించారు. దీంతో మహిళ కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు.

సీఏఏ, ఎన్ఆర్‌సీలకు మద్దతిచ్చింది మీరు కాదా..?

● ఎంపీ మిథున్, సాయిరెడ్డిపై టీడీపీ మైనారిటీ నాయకుల ధ్వజం


టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు

మదనపల్లె టౌన్, మార్చి 17: కేంద్ర ప్రభుత్వం 2019 లో సీఏఏ, ఎన్ఆర్‌సీ బిల్లులు ప్రవేశపెట్టడానికి పార్లమెంట్‌లో చర్చ నిర్వహిస్తే ప్రొటెం స్పీకర్‌గా వున్న ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీ మద్దతిస్తోందని ప్రస్ఫుటంగా చెప్పలేదా? అని టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం రఫి, ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నాగూర్‌వలి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేవలం ఎన్నికల సమయంలోనే ముస్లిం మైనారిటీలపైన ఎంపీ మిథున్‌రెడ్డి ఎక్కడ లేని ప్రేమ కనపరుస్తున్నాన్నారు. టిప్పు సుల్తాన్ మైదానంలో 108 ముస్లిం కుంటుబాలు వృత్తులు చేసుకుంటూ వేసుకున్న షెడ్లను వైసీపీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా బలవంతంగా పోలీసులను పెట్టి తొలగిస్తుంటే ఎంపీ మిథున్‌రెడ్డి ఎందుకు అడ్డుపడలేదని ప్రశ్నించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ మదనపల్లెలో ముస్లీంల అభ్యున్నతికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. పఠాన్‌ఖాదర్‌ఖాన్, బాలుస్వామి, సుద్దిళ్ల సుధాకర్, బావాజాన్, దాదాపీర్, గిరీష్ తదితరులు వైసీపీ నాయకులపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాదెళ్ల శివన్న, షంషీర్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కత్తి లక్ష్మన్న, చీకిలబైలు సర్పంచ్ ఎం.ప్రభాకర్, ఈశ్వరమ్మకాలని ఎంపీటీసీ దేవేంద్ర, మహబూబ్‌ఖాన్, కమలమ్మరి కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిది ధృతరాష్ట్రుడి కౌగిలి

● రాజకీయంగా ఎవ్వరిని ఎదగనీయరు
● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్


మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మార్చి 17: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిది ధృతరాష్ట్రుడి కౌగిలి అని రాజకీయంగా ఎవ్వరిని ఎదగనీయరని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తప్పుపట్టారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి రాజకీయాల్లో వచ్చిన వెంటనే పీలేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మొఘల్ సైపుల్లాబేగ్‌ను రాజకీయంగా ఎదగనీయకుండా తొక్కేశారన్నారు. ముస్లీం మైనారిటిలకు పెద్దిరెడ్డి కుటుంబం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. పెద్దిరెడ్డి ధృతరాష్ట్ర కౌగిలిలో ఆయన కబంధ హస్తాల్లో నలిగిపోయిన ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు మదనపల్లెలోనే వున్నారని ఇక మిగిలింది నిస్సార్‌అహ్మద్ ఒక్కరే అని ఎద్దేవా చేశారు. మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా షాజహాన్‌బాషాను టీడీపీ అధిష్టానం ప్రకటించగానే వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు షాజహాన్‌బాషాను అత్యధిక మెజారిటితో గెలిపిస్తారని వెంకటేశ్ జోస్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు, అన్వర్‌బాషా, రామచంద్ర పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషాకు పలువురి మద్దతు

మదనపల్లె టౌన్, మార్చి 17: మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషాకు పలువురు మద్దతు తెలి పారు. ఆదివారం ఉదయం ఆయన స్వగృహం వద్ద బీజేపీ నాయకుడు ఎన్.సేతు మర్యాదపూర్వకంగా కలసి షాజహాన్‌బాషను సత్కరించారు. అలాగే చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ సమీప బంధువు రుచిర ప్రాజెక్ట్ అధినేత గోనికుంట్ల రాము షాజహాన్‌బాషాను కలసి మద్దతు ప్రకటించా రు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలవాలని, రాష్ట్రం లో వైసీపీ రాక్షస పాలనను సాగనంపాలని పిలుపునిచ్చారు.

కిశోర్‌కుమార్‌రెడ్డికి కురవపల్లె గ్రామస్థుల మద్దతు


కిశోర్‌కుమార్ రెడ్డి ముూకుమ్మడి సంఘీభావం తెలుపుతున్న కురవపల్లెవాసులు

కలికిరి, మార్చి 17: పీలేరులో టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి మండలంలోని కురవపల్లె గ్రామస్థులు మద్దతు ప్రకటించారు. శనివారం రాత్రి నగరిపల్లెలో కిశోర్‌కుమార్‌రెడ్డిని నేరుగా కలిసి సంఘీ భావం ప్రకటించారు. సొంత పంచాయతీకి చెందిన పాలెంకురవపల్లె గ్రామస్థులు ఇలా ఏకం కావడం సంతోషంగా వుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో కిశోర్‌కుమార్ రెడ్డి అభ్యర్థిగా ఉండటంతో తామంతా ఏకమై మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను అన్ని విధాలా అండగా వుంటానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో బాబు, బీరయ్య, నారాయణ, పురుషోత్తం, వెంకట్రమణ, సి.రమణ, ఈశ్వరయ్య, లక్ష్మయ్య, రమేష్, ఎర్రాజు, కె.రమణ, కె.భాస్కర, ఎ.సురేంద్ర, సహదేవ తదితరులున్నారు.

కలసి పనిచేద్దాం..ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దాం

● ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా ప్రకటన


షాజహాన్‌బాషాను సత్కరిస్తున్న రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, మార్చి 17:ఎన్నికల్లో మనమంతా కలసి పనిచేసి, ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా కోరారు. స్థానిక ఏపీనాయుడు కాలనీలోని జనసేన రాష్ట్రఫైనాన్స్‌కమిటీ సభ్యురాలు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్‌లను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పొత్తు ధర్మంలో భాగంగా మనమంతా కలసి పనిచేస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని ఆయన పేర్కొన్నారు. జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులుతో కలసి గ్రామ స్థాయిలో పార్టీశ్రేణులను సన్నద్ధం చేయాలని షాజహాన్‌బాషా సూచించారు. ఈ సందర్భంగా ఏపీనాయుడు కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులు..వారి దృష్టికి తీసుకురాగా, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ ఎన్.విద్యాసాగర్, కుప్పాల శంకర్, అశ్వత్, ధరణి, సోను, సుప్రీం హర్ష, గణేష్, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి


మాట్లాడుతున్న ఇంతియాజ్ అహ్మద్

గుర్రంకొండ, మార్చి 17:తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మైనారిటీలు అభివృద్ధి చెందుతారని మాజీ సమాచారహక్కు చట్టం కమిషనర్ ఇంతియాజ్‌అహ్మద్ పేర్కొన్నారు. గుర్రంకొండ బజారు వీధిలోని కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో మైనారిటీలకు గుర్తింపు తెచ్చింది టీడీపీ అన్నారు. టీడీపీ హయాంలోనే మైనారిటీలకు పలు పథకాలు అందాయన్నారు. టీడీపీ-బీజేపీ పొత్తుతో మైనారిటీలకు మేలు జరుగుతుందన్నారు. మైనారిటీ కోసం ప్రవే శపెట్టిన పథకాలు కొనసాగాలంటే టీడీపీని గెలిపించాలని మైనారిటీలను కోరారు. కార్య క్రమంలో నేతలు నౌషాద్‌అహ్మద్, నక్కా సతీష్, ఏజాజ్ అహ్మద్, నక్కా బాలాజి, ఇక్బాల్, కుమార్, రాజు, రమణ, శ్రీనివాసులు, గౌరి శ్రీన, నవాబ్, జమీర్, మౌలా, తన్వీర్ పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు తరలిన తెలుగు తమ్ముళ్ళు


ప్రజాగళం సభకు తరలిన తెలుగు తమ్ముళ్ళు

కురబలకోట, మార్చి 17:ప్రధాని మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభకు తంబళ్ళపల్లె నియోజకవర్గానికి చెందిన తెలుగుతమ్ముళ్ళు తరలి వెళ్లారు. శనివారం నియో జకవర్గ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సదాశివ, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, శంకర్‌రెడ్డి, వెంకటరమణా రెడ్డి, రామచంద్ర, మోహన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మునీంద్ర, తెట్టు ఉపసర్పంచ్ బి.బాస్కర్ పాల్గొన్నారు.